క్లుప్తంగా

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవేందర్‌రెడ్డి

దేవరకొండ : రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 21, 22తేదీల్లో జరుగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర సంక్షేమ చట్టం చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల బోర్డులో దళారుల బెడదను అరికట్టి బోగస్ కార్డులను ఏరివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూనె రామస్వామి, వెంకట్రాములు, మల్లయ్య, సైదులు, లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు సన్మానం


శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిడమనూరు : ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారి మండల కేంద్రానికి వచ్చిన శంకర్‌నాయక్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి, శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడారు. కాంగ్రెస్‌లో పని చేసిన ప్రతి ఒక్కరికీ పదవులు దక్కుతాయని, పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, నారమ్మగూడెం మాజీ సర్పంచ్ దుబ్బాకుల రాంరెడ్డి, నిడమనూరు మాజీ ఉపసర్పంచ్ శేష రాజు దాసు, పురుషోత్తం, యువజన కాంగ్రెస్ నాయకుడు నర్సింగ్ విజయ్‌కుమార్, నందికొండ మట్టారెడ్డి, సైదాచారి ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ సదస్సును విజయవంతం చేయాలి


కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : త్రిపురారం మండల కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించే నియోజకవర్గ స్థాయి ఐఎన్‌టీయూసీ సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న పిలుపునిచ్చారు. గురువారం నాగార్జునసాగర్‌లో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి చేతుల మీదుగా సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సరోత్తంరెడ్డి, మారయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో దిగుబడులు


బిందు సేద్యంపై అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారి షేక్ నసీమా

మిర్యాలగూడ : కూరగాయల సాగు బిందు సేద్యంతో చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మిర్యాలగూడ క్లస్టర్ హార్టికల్చర్ అధికారి షేక్ నసీమా అన్నారు. గురువారం మండలంలోని కిష్టాపురం గ్రామంలో రైతు కల్లుట్ల వెంకట్‌రెడ్డి 8ఎకరాల్లో చేపట్టిన పందిరి కూరగాయలు సాగును ఆమె పరిశీలించి మాట్లాడారు. బిందు సేద్యం, ఎరువుల యాజమాన్యంతో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించి అధిక దిగుబడులను సాధించవచ్చని రైతుకు సూచించారు. మల్చింగ్ డ్రిప్ పద్ధతిలో కలుపును నివారిస్తూ మొక్కల మధ్య డ్రిప్ ద్వారా నీటిని అందిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతర పంటలుగా ఆకుకూరలను సాగు చేస్తూ అధిక లాభాలు పొందవచ్చన్నారు. బిందు సేద్యానికి 90శాతం, మల్చింగ్‌కు 50శాతం సబ్సిడీతో ఉద్యాన శాఖ రాయితీని అందిస్తుందన్నారు.

గ్రామపంచాయతీకి ట్రాక్టర్ అప్పగింత

సాక్షి ఎఫెక్ట్

చందంపేట : మండలంలోని బుడ్డోనితండా గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను మాజీ సర్పంచ్ పదవీకాలం ముగిసినా తన ఆధీనంలో ఉంచుకున్న విషయమై సాక్షి దినపత్రికలో 'పెండింగ్ బిల్లు వచ్చే వరకు.. ట్రాక్టర్ ఇవ్వ' అనే శీర్షికన ప్రచురించిన వార్తా కథనానికి ఎంపీడీఓ స్పందించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ ఆధీనంలో ఉన్న ట్రాక్టర్‌ను గ్రామపంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా వార్తా కథనాన్ని ప్రచురించిన సాక్షికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

అద్దె భవనాల్లో అవస్థలు


జూనూతుల గ్రామంలో అద్దె భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం


తేనపల్లితండాలో పాఠశాల గదిలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్యాలయం

- 11గ్రామాల్లో నిర్మించని భవనాలు
- పంచాయతీ రికార్డులకు రక్షణ కరువు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు

గుర్రంపోడు : మండలంలోని పలు గ్రామపంచాయతీలకు సొంత కార్యాలయ భవనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో అరకొర వసతుల నడుమ పాలన సాగించాల్సిన దుస్థితి నెలకొంటుంది. గ్రామస్తులు సమకూర్చిన ఇళ్లలోనూ, అద్దె ఇండ్లలో అసౌకర్యాల మధ్య పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా 16నూతన గ్రామపంచాయతీలు గుర్రంపోడు మండలంలోనే ఏర్పడ్డాయి. దీంతో మండలంలో మొత్తం గ్రామపంచాయతీల సంఖ్య 37కు చేరింది. గతంలో 21గ్రామపంచాయతీలకు ఉపాధిహామీ నిధులు రూ.16లక్షల వెచ్చించి సొంత భవనాలు నిర్మించారు. ఆ తర్వాత గత ప్రభుత్వ హయాంలో 11 గ్రామపంచాయతీలకు రూ.20లక్షలతో ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు చేశారు. నిధులు సరిపోవని, సరిగా బిల్లులు రావడం లేదని అప్పట్లో భవనాల నిర్మాణాలు చేపట్టడానికి సర్పంచ్‌లు ముందుకు రాలేదు. దీంతో అద్దె భవనాల్లో వసతులు లేని ఇళ్లల్లో, ప్రభుత్వ పాఠశాలల్లోని ఓ గదిలో పాలన నిర్వహించడం కార్యదర్శులకు ప్రస్తుతం ఇబ్బందికరంగా మారుతుంది. మండలంలో జూనూతుల, లక్ష్మీదేవిగూడెం, గుర్రంపోడు గ్రామపంచాయతీల్లో భవన నిర్మాణాలు పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. బిల్లులు రావడం లేదని అప్పట్లో సర్పంచ్‌లు పనులను నిలిపివేశారు.

రికార్డులకు రక్షణ కరువు..

పంచాయతీ రికార్డులను భద్రపర్చడంలోనూ పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమైన రికార్డులను సర్పంచ్‌ల ఇళ్లలోనూ తమ వద్దనో ఉంచుకోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. గ్రామాల్లో స్థానికంగా ఉండని, వలస వెళ్లిన వారి ఇళ్లలో గ్రామపంచాయతీ కార్యాలయాలు నిర్వహిస్తుండడంతో కార్యదర్శులు నీటివసతి, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. మొదట్లో పంచాయతీ కార్యాలయాలకు ఇళ్లను ఇచ్చిన వారు ఖాళీ చేయాలని చెబుతుండడంతో మరో ఇళ్లు వెదుక్కోవాల్సి వస్తుందని కార్యదర్శులు వాపోతున్నారు. సమావేశాలు ఇరుకైన, వెలుతురు లేని గదుల్లో, అదే విధంగా రోడ్లపై నిర్వహించడం ఇబ్బందిగా ఉంటుందని అంటున్నారు. అదే విధంగా గ్రామపంచాయతీల్లో ఫర్నీచర్‌కు రక్షణ లేకుండా పోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన గ్రామపంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



గ్రామపంచాయతీ కార్యాలయాల భవనాల నిర్మాణాలు ఉపాధిహామీ నిధులతో చేపట్టేందుకు గతంలో సర్పంచ్‌లు ముందుకు రాలేదు. ఈసారి కొత్తగా సర్పంచ్‌లు వస్తే గ్రామపంచాయతీ భవన నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపే అవకాశం ఉంది. మండలంలో నిలిచిన గ్రామపంచాయతీల భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం.

– శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బాలునాయక్


లబ్ధిదారులకు స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రైతులకు మంజూరైన స్ప్రింక్లర్లు, పైపుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ సిరాజ్‌ఖాన్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, కొండ్ర శ్రీశైలంయాదవ్, మారుపాకల సురేష్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, బిక్కునాయక్, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, ఆయా శాఖల అధికారులు, తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


మిర్యాలగూడ టౌన్ : బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ బాలునాయక్


గుర్రంపోడు : తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి బాలునాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీపార్క్ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లోని ప్రతి ఉపాధ్యాయుడు ఐదుగురి కంటే ఎక్కువ విద్యార్థులను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కురువ, ఉపాధ్యాయులు ప్రవీణ్, రామ్‌రెడ్డి, నిర్మల, పార్వతి, ఎలిషా, వెంకటరమణాచారి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, పద్మ, సలిమా, సరిత, రజిత, సైదులు, వెంకన్న, తదితరులున్నారు.

గుర్రంపోడు : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను తమ గ్రామ పాఠశాలల్లోనే చేర్పించాలని నడికూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు కాలం నారాయణరెడ్డి కోరారు. గురువారం మండలంలోని నడికూడ గ్రామంలో ముందస్తు బడిబాటలో భాగంగా తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచర్లు బి.వెంకట్‌రెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, సైదమ్మ, నాయకులు యాదగిరిగౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


పెద్దవూర : కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ వెంకట్‌రెడ్డి

పెద్దవూర : కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ సీఈఓ వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ మనోహర్, రైతులు శేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జానారెడ్డి ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో తనిఖీ

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫరీదుద్దీన్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్‌ఐ హకీం, కేంద్రం నిర్వాహకుడు శంకర్ ఉన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆర్‌ఐ శ్యాంకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐకేపీ కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని త్వరతగతిన ఎగుమతులు చేయాలన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యంపై టార్పాలిన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట వీబీకే వినోద, రైతులు తదితరులున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు కాన్వగేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ రాములు

పెద్దవూర : చదువుతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వండర్ కిడ్స్ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డు కాదన్నారు. ప్రణాళికాబద్ధంగా ఇప్పటినుంచే లక్ష్యాన్ని ఎంచుకుని నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం సైనిక్ స్కూల్, గురుకుల పోటీ పరీక్షల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు మెడల్స్, కాన్వకేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ షేక్ మౌలాలీ, ప్రిన్సిపల్ అశోక్, ఉపాధ్యాయులు తేజ, సుభాషిని, రమ, పావని, బాలాజీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆందోళన

వేములపల్లి : మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై సీపీఐ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ రహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా సర్వీస్ రోడ్డు నిర్మించే ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎండీ.సయ్యద్, లింగానాయక్, వెంకట్‌రెడ్డి, వెంకన్న, రంగారెడ్డి, శ్రీనివాస్ కృపయ్య ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

మిర్యాలగూడ అర్బన్: ఆటోలో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగును ఆటో డ్రైవర్ తిరిగి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని కాకతీయ హైస్కూల్ వద్ద ప్రయాణికురాలు లోకల్ ఆటోను ఎక్కింది. ఆదిత్య స్కూల్ వద్ద దిగి తన బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయింది. చాలాసేపటి తరువాత ఆటో డ్రైవర్ రామకృష్ణ బ్యాగ్‌ను గుర్తించాడు. వెంటనే ఆదిత్య స్కూల్ వద్దకు వెళ్లి అక్కడ ఆరాతీసి ప్రయాణికురాలికి బ్యాగును అందజేశాడు. బ్యాగులో డబ్బుతో పాటు విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయని, నిజాయితీగా తన బ్యాగును తెచ్చి ఇచ్చిన ఆటో డ్రైవర్‌కు ప్రయాణికురాలు కృతజ్ఞతలు తెలిపారు.

భూ భారతి పోర్టల్‌పై నేడు అవగాహన సదస్సు

హాలియా : అనుముల మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో భూ భారతి పోర్టల్‌పై శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఘు గురువారం తెలిపారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొంటారని, రైతులు పాల్గొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

రేపు మెగా వైద్యశిబిరం

డిండి : చందంపేట మండలంలోని పోలేపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డిండి సర్కిల్ సీఐ సురేష్ గురువారం తెలిపారు. ఈ శిబిరం ప్రారంభానికి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

19న రన్ ఫర్ జీసస్

మిర్యాలగూడ : నియోజకవర్గ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న రన్ ఫర జీసస్ 2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ నియోజకవర్గ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కాంతయ్య అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని సాగర్‌రోడ్డు ఫ్లెటైవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్‌చౌక్ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్ రాజు హాజరవుతున్నట్లు తెలిపారు. క్రైస్తవులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని జ్యోతి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జ్యోతి ఆస్పత్రి డాక్టర్ మువ్వ రామారావు, జీవన జ్యోతి అన్నారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆరోగ్యశ్రీలో గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. కాలానుగుణంగా గ్యాస్ట్రో ఎంటరాలజీతో పాటు హార్ట్‌ఎటాక్ రోగుల కోసం క్యాత్‌ల్యాబ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో కార్డియాలజిస్టు డాక్టర్ వెంకటేష్, గ్యాస్ట్రో ఎంటరాలజీ సర్జన్ డాక్టర్ శ్రీహర్ష, గ్యాస్ట్రో ఎంటరాలజీ డాక్టర్ ఆదిల్‌భాష, ఆస్పత్రి ఐవీఎఫ్ ఇన్‌ఫెర్టిలిటీ గైనకాలజీ వైద్యురాలు అమూల్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


వార్డు ఆఫీసర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, పక్కన సబ్ కలెక్టర్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి జవాన్లు, ఉద్యోగులతో పాటు ప్రత్యేకంగా వార్డు ఆఫీసర్లతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపాలిటీకి నూతనంగా వచ్చిన వార్డు ఆఫీసర్లు తమ వార్డుల్లో చెత్తా, చెదారం లేకుండా చూడాలన్నారు. అదే విధంగా హోటళ్లు, తోపుడుబండ్లు, మిర్చి, ఇడ్లీ బండ్ల వద్ద అపరిశుభ్రంగా ఉండకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య విషయంలో ఎవరిని కూడా ఉపేక్షించేది లేదన్నారు. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జవాన్లు, పారిశుద్ధ్య సిబ్బంది కూడా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. పారిశుద్ధ్యం విషయంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావద్దన్నారు. అదే విధంగా మున్సిపాలిటీలోని ఆస్తి పన్నులు, నల్లా బిల్లుల వసూళ్లు వేగవంతంగా చేపట్టాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తేనే మున్సిపాలిటీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, మున్సిపల్ డీఈఈ వెంకన్న, టీపీఓ సోమయ్య, ఆర్ఓ కల్యాణి, టీపీఎస్ అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, టీఎంసీ బక్కయ్య, సిబ్బంది తదితరులున్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి


మిర్యాలగూడ టౌన్ : కోర్టు వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న న్యాయవాదులు


దేవరకొండ : నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

దేవరకొండ : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని దేవరకొండ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నాయిల ఉమామహేష్ అన్నారు. బుధవారం సూర్యాపేటలో న్యాయవాది మంతాపురం కిశోర్‌పై జరిగిన దాడికి నిరసనగా గురువారం దేవరకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కర్నాటి సురేష్, గాజుల ఆంజనేయులు, గౌరీశంకర్, చెనగాని అశోక్, శ్రీనివాస్, జగదీష్, ఇడెం రవి, శ్రీకాంత్, ఆంజనేయులు, శంకర్, గణేష్, కృష్ణ, యాదయ్య, రాజ్‌కుమార్, తదితరులున్నారు.

న్యాయవాదుల రాస్తారోకో

మిర్యాలగూడ టౌన్ : సూర్యాపేట పట్టణంలో న్యాయవాది కిశోర్‌పై దాడి చేసినందుకు నిరసనగా గురువారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్చర్ల–కోదాడ ప్రధాన జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలీసులకు వ్యతిరేకంగా న్యాయవాదులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేతి సత్యనారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం తక్షణమే న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుండి శ్రీనివాస్, కోశాధికారి జి.సాయికుమార్‌యాదవ్, జాయింట్ కార్యదర్శి చెలిమల పద్మయ్య, బాలునాయక్, న్యాయవాదులు లింగంపల్లి శ్రీనివాస్, వాకిటి శ్రీనివాస్, ఇబ్రహీం, ఎం.పవన్‌కుమార్, దూపాటి మట్టయ్య, రాయరపు భాస్కర్‌నాయుడు, వీరేంద్ర నాయుడు, రెడ్డిపల్లి సైదులు, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, జిల్లెపల్లి శ్రీనివాస్, తదితరులున్నారు.

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి


విద్యార్థులను అభినందిస్తున్న సీఐ పీఎన్‌డీ ప్రసాద్

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని మిర్యాలగూడ రూరల్ సీఐ నాగదుర్గ ప్రసాద్ అన్నారు. మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామ పరిధిలోని కేశవనగర్‌లో గల శ్రీచైతన్య ఐపీఎస్ బ్రాంచీ విద్యార్థులు నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐలు మల్లికంటి లక్ష్మయ్య, కృష్ణయ్య, మాడుగులపల్లి ఎస్‌ఐ కృష్ణయ్య, పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం సుధాకర్, ఆర్‌ఐ సుజిత, జోనల్ కోఆర్డినేటర్ నాగేంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాసాచారి, ఐపీఎల్ ఇన్‌చార్జ్ శ్రీను, ఉపాధ్యాయులు హఫీజ్, ప్రశాంత్, భార్గవి, రమేష్, సత్యానారాయణ తదితరులున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లు

పెద్దవూర : కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించి పేస్కేల్ అమలు చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు బి.ఎల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ సుధీర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. జనవరి నుంచి మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని, కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు ఇచ్చి విధి నిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాంబాబు, హరిలాల్, భరత్, రాము, సైదులు, శ్రీను, ప్రభాకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


హాలియా : బాలింతలకు పోషకాహారం అందిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉదయశ్రీ


చింతపల్లి : అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ


అడవిదేవులపల్లి : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న టీచర్

హాలియా : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ ఉదయశ్రీ, ఎంపీడీఓ సుజాత అన్నారు. ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్స్, గర్భిణులు, బాలింతలకు నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు చిన్నారులకు ఎంతో శ్రేష్ఠమన్నారు. బాలింతలకు మొదటి వెయ్యి రోజుల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ రామకృష్ణ, టీఎంటీ పద్మ, ఏసీడీపీఓ సువర్ణ, జిల్లా ఉమెన్ ఎంపవర్ రిబ్కా, సూపర్‌వైజర్స్ రమాదేవి, సైదాబేగం, ఫరీదా, యాదమ్మ, శశికళ, బీసీ పవన్, అంగన్‌వాడీ టీచర్స్, తదితరులు ఉన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపించాలి

మిర్యాలగూడ టౌన్ : బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రుపాలను తాపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పద్మ అన్నారు. గురువారం పట్టణంలోని సీతారాంపురం-1, 3 అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారాన్ని తప్పని సరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, శేషుమణి, నాగమణి, విజయ, గౌస్య, నజీమా, షబానా, షాహిన్, మురాజ్, ఆయాలు శైలజ, ఏఎన్‌ఎం సంధ్యారాణి, ఆశవర్కర్ నాగమణి, ఆర్‌పీలు లక్ష్మీప్రసన్న, ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు మోహనలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులున్నారు.

ఉల్సాయిపాలెంలో పోషణ పక్షం

అడవిదేవులపల్లి : మండలంలోని ఉల్సాయిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాజు చిరుధాన్యాల వలన వచ్చే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం కవి, అంగన్‌వాడీ టీచర్లు శిరీష, గమ్మి, కమిలి, విజయ, మంగి తదితరులున్నారు.

చింతపల్లి : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి అన్నారు. పోషకాహార వారోత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు శ్రీదేవి, ఇక్బాల్, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారం తీసుకోవాలి

మాడ్గులపల్లి : గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవడంతో రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ చంద్రకళ అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోషకాహారంపై ఆమె అవగాహన కల్పించారు. ప్రతిరోజు భోజనంలో సమతుల్య ఆహారం ఉండేలా చూసుకోవాలన్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఏపీఎం చంద్రకాంత్, ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.